# హాస్యకథ

# సాహిత్యోద్యోగం.



ఆదివర్వం అతిసీరియస్‌గా చదవడానికి మరొక్కసారి ప్రయత్నించాడు మంగళగిరి. అంటే అతనా రోజు మహాభారతంలో పేజీలు తిరగెయ్యడానికి అనేక విఫలప్రయత్నాలు చేశాడని తాత్పర్యం.

టేబుల్ పై గుట్టగుట్టలుగా పేరుకుపోయిన ఫైళ్ళ వంక గుర్రుగా చూడసాగాడు మంగళగిరి. కాలం కర్మ కలిసిరాక పోతే మానవ ప్రయత్నం ఫలించని అతను విసుగ్గా భారతాన్ని మూశాడు. బాగా లంచం ముట్టే ఫైల్లని తెరిచాడు.

సాయంకాలం నాలుగున్నరకి ఆఫీసు పనికి స్వస్తి పలికి సభాపర్వ పఠనానికి శ్రీకారం చుట్టాడు.

సరిగ్గా అదే ముహూర్తంలో ఊడిపడ్డాడు భద్రాచలం. ఏపుగా పెరిగిన వెండి గెడ్డం, తైలసంస్కారం ఎరుగని గోల్డ్ జుట్టు, పైక ఎగగట్టిన మాసిన పంచె, మోకాళ్ళు దాటిన మాసిక వేసిన అంగీ, వెరసి భద్రాచలం.

అతను ఆఫీసులోకి వస్తూనే కామా, ఫుల్‌స్టాప్ లేకుండా తన గోడుతో గొల్లుమన్నాడు.

“లోన్ అప్లికేషన్ ఎప్పుడిచ్చావ్” చికాకుగా గదమాయించాడు మంగళగిరి.

“వారం.. పది రోజులయిందయ్యా”

“వారమా... పదిరోజులా? సరిగ్గా చెప్పితగలడు. ఎక్కడని వెతకను. ఎకనాలెడ్జిమెంట్ వుందా?”

అతను చిర్రుబుర్రులాడేసరికి, తలగోక్కుని “ఉందయ్యా” అంటూ సాలోచనగా నాలిక కరుచుకున్నాడు భద్రాచలం.

“ఆసుపత్రిలో మరిచిపోయాను”

“అసాధ్యుడివి. ఆఫీసు పనిపై అడవూరు నుంచి వచ్చి ఆసుపత్రిలో విడిది చేశావా? లోన్ శాంక్షన్ కై ఈవూరు వచ్చి లాడ్జింగ్ బోర్డింగ్ ఖర్చులు లేకుండా ఏదో జబ్బు నెపంతో హాస్పటల్లో బస చేశావా?” మాటలు మార్చిమార్చి ఫెళఫెళ నవ్వుతూ ఎద్దేవా చేశాడు.

“తమ కున్నంత ఆలోచన లేదు సార్. టెన్త్ తప్పి పొలందున్నుకుంటున్నాను. మా ఆడదానికి ప్రాణం మీదికి వస్తే ఆసుపత్రిలో చేర్చాను. నా సంచీ అక్కడే వుంది. ఇక్కడున్నట్లు తీసుకు వస్తాను”

ముందు కురక బోతున్న అతని దూకుడికి అడ్డు తగిలి “అఘోరించావులే. రేపు తగలడు” చీదరించి తరిమేశాడు మంగళగిరి. ఏదో మాట వరసకి రేపన్నాడుగాని, లంచం యివ్వలేని కేసులు 'రేపు' అని గోడ మీద రాసుకోక తప్పదు.

నిర్లిప్తంగా కాళ్ళీడ్చుకుంటూ భద్రాచలం నిష్క్రమించగానే, పట్టువదలని విక్రమార్కుడిలా 'పాండవోద్యోగ విజయాలు' పుస్తకం తీసి 'పరాబ్రహ్మ' అనిరాగాలు తీయసాగాడు.

“క్లర్క్ మంగళగిరి రావు తమరేనా?

అతివినయంగా ప్రశ్నించిన అతగాడు పొట్టిగా ముందుకు పొడుచుకువచ్చిన పొట్టతో మరింత ఎబ్బెట్టుగా వున్నాడు. పైకి ఎగదువ్విన పల్చని క్రాఫ్‌కి నల్లరంగు వేశాడు. చిన్న ముఖానికి పెద్ద భూతద్దాల సిల్వర్ ఫ్రేమ్ జోడు సఫారీ డ్రస్ దర్పం.

అతనెవరో అంతుబట్టక "నేనేగాని రేపురండి" సీరియస్‌గా రిస్టువాచీ వంక చూశాడు మంగళగిరి.

"మీ క్రమశిక్షణ గురించి ఎవరో చెప్పగా వినడమే గాని ప్రత్యక్షంగా చూడలేదు. కరక్టుగా అయిదు కొట్టగానే ఆఫీసుకి టా... టా.... చెప్పేస్తున్నారు. టూమచ్ డిసిప్లైండ్. మీలాంటి వార్ని కలవడం నాకెంతో గొప్పగావుంది. బైదిబై.... అయామ్ ప్రొప్రైటర్ కమ్ ఎడిటర్ అమావాశ్య పున్నమి" జిడ్డు హాసం సాగదీస్తూ అతను చేయిజాపాడు.

మంగళగిరి ఆశ్చర్యంగా ఆనందపడి పిచ్చిగా అతని చేతిని పిప్పిచేసి, సీట్ ఆఫర్ చేసి, వినయం గుబాళించేలా చిరుహాసం తో అన్నాడు.

"నేను మీరనుకున్నంత గ్రేట్ కాదు. వొన్లీఫిఫ్టీ పర్సంట్ పంక్చువల్. కరక్టుటైంకి ఆఫీసుకి రాలేనుగాని అయిదు కొట్టగానే ఆఫీసుగడప దాటుతాను"

"ఈ మాత్రం సగం క్రమశిక్షణ తో ఎంత మంది ఉంటున్నారు ? ఆఫీసుకి ఎప్పుడు వస్తారో తెలియదు. ఎప్పుడు పోతారో తెలియదు. మీరు నాకు అనేక విధాల నచ్చారు. మా పత్రిక్కి మీరు పంపిన కవిత చదివాను. చాలా గొప్పగా వుంది. ఇలాంటి కవిత లాటిన్‌లో కూడా ఇంతవరకు రాలేదంటే నమ్మండి. ఈ వాళ సాయంకాలం మీ ఉపన్యాసం వుందని విని ఇలా చక్కావచ్చేశాను." తూచి తూచి మొగ్గ మాటలు పెంచుతున్నాడు అమావాశ్యపున్నమి.

"థాంక్యూ...సోమచ్...నా లెక్చర్ వినాలని నన్ను వెతుక్కుంటూ బెజవాడ నుంచి వచ్చారా? అయామ్ వెరీలక్కీ ....ఏంతీసు కుంటారు ....కాఫీ. ...టీ....కూల్‌డ్రింక్.. ...మరింకేదైనా.... బయటికెళ్ళి పుచ్చుకుందాం,....."

మంగళగిరి ధోరణికి అడ్డుతగిలి "థాంక్యూ... నాకేం వద్దు....అలాఅని మిమ్మల్ని చిన్నబుచ్చడం నాకిష్టం లేదు. మా బావమరిది లోన్ ఫైల్ మీ ఆఫీసులో ఇంకా మగ్గుతూనే వుంది" నిష్ఠూరంగానే ముగ్గులోకి వచ్చాడు.

"మీ బావమరిది కేసని తెలీక పెండింగ్ లో పెట్టి వుంటాను. ఎప్పుడు పంపారు?'


'పది పదకొండు నెలలో.... నాలుగైదు వారాలో.... కావచ్చును. ఖచ్చితంగా చెప్పలేను"


అతను మాటలు నాన్చేసరికి పిచ్చిగా జుత్తుని పీక్కోలేక, ఏదో చెప్పలేని బాధతో విలవిల్లాడాడు మంగళగిరి.

"ఇంతకీ లోన్ అప్లై చేసింది మేలురకం విత్తనాలు కొనడానికా ? ఎరువులకా? క్రిమినంహారక మందులకా? బావితవ్వడానికా ?"

"ఫెర్టిలైజర్స్‌కో, పెస్టిసైడ్స్ కో తెలీదు గాని బావితవ్వడానికి మాత్రం కాదు. ఎందుకంటే మా బావమరిదికి సెంట్ పొలం కూడాలేదు. నిమిషాల మీద లోన్ శాంక్షన్ కావాలి. ఎంత కావలంటే అంత లంచం యిస్తాను. యిది ప్రిస్టేజి క్వశ్చన్' 'అవనరానికి మించి మాటలు పెంచుతున్నాడు.

"అన్నన్న...ఎంతమాట. మీ దగ్గర





తీసుకుంటానా? మీరడగకుండానే యిస్తాను. నాకవితలు... అది సరేలేండీ... ఇంతకీ మీ బావమరిది పేరు చెప్పారుగాదు"

"నన్ను చెప్పనిస్తేగా...సస్పెన్స్ నవల్లా మాటలు పొడిగిస్తున్నారు. మీరు సీరియల్స్ రాస్తే జనం విరగబడి చదువుతారు. నా కోనవల యివ్వండి. మీ పేరుతో మా పత్రిక సర్క్యులేషన్ పెంచుకుంటాను. అన్నట్లు మరిచాను. మా బావమరిది పేరు వినుకొండ"

మంగళగిరి అమాంతం ఉబ్బిపోయి పెండింగ్ ఫైళ్ళ గుట్టల పైకి లంఘించాడు. అంతలో హడావిడిగా వచ్చిన ప్యూన్ "ఆఫీసర గారికి వేరేపనులున్నాయిట. మీటింగ్ కి ఉండరట. రాత్రి పార్టీటైంకి వస్తారుట" అన్నాడు పొడిపొడిగా.

"అసలు విషయం మరిచాను. నువ్వా మీటింగ్ ఏర్పాట్లు చూడు" అని ప్యూన్ ని పురమాయించి ఫైళ్ళ మోపులు విప్పుతూ, కదుతున్నాడు మంగళగిరి.

ఆ కార్యాలయ సాహితీ సంస్కార సమితికి స్థాపకాధ్యక్షుడు మంగళగిరి. ఆరోజు సాయంకాలం మీటింగ్‌లో అతనే వక్త.

ఆఫీసు ముందున్న ఖాళీస్థలంలో కుర్చీలు లైన్‌గా అమరుస్తున్నాడు ప్యూన్. ఆ కార్యాలయ ఉద్యోగులు తాపీగా కుర్చీల పైకి చేరుతున్నారు.అచ్చుకి నోచుకోని మంగళగిరి రచనలు చెవులారా వినడానికి కాదు. సభానంతరం అతనిచ్చే పార్టీకై లొట్టలు వేస్తూ. అదీసంగతి మరి.

పెండింగ్ ఫైళ్ళ దుమ్ముధూళితో బుచాడిలా మారిన మంగళగిరి కళ్ళల్లో ఉక్రోషం సుడులు తిరుగుతోంది.

"మీకి లాంటి కష్టం వస్తుందనే వినుకొండ దగ్గర ఇంకో లోన్ అప్లికేషన్ తీసుకున్నాను" చాప క్రింద నీరులా జేబులోంచి కాగితాలు తీశాడు అమావాశ్యపున్నమి. బ్రతకనేర్చిన వాడు మరి.

అప్పటికప్పుడే వినుకొండకి లోన్ శాంక్షన్ చేస్తున్నట్లు ఫైలు తయారు చేశాడు మంగళగిరి.

ఇద్దరూ సభా ప్రాంగణానికి వచ్చారు. అమావాశ్య పున్నమికి పెద్దపీటవేసి, గొంతుపెంచాడు మంగళగిరి.

"ప్రియమైన సాహితీ సంస్కారులకి నమస్కారం. నేటి నా లెక్చర్ టాపిక్ సాహిత్యప్రయోజనం. ప్రాచీన సాహిత్యం రాజాశ్రయానికై పరుగులు తీసింది. సమాజశ్రేయస్సుకై నిలబడలేదు. తాతల నాటి బావి అని ఉప్పునీళ్ళు తాగుతున్నాం.

ఇకనేటి సాహిత్యం ఏలూరు రోడ్డు పుస్తకాల వెల్లువలో పూచిక పుల్ల. నిన్నానేడు స్వచ్ఛమైన సాహిత్యానికి కరువొచ్చింది. ఎందువల్ల ?"

అతని ఉపన్యాసానికి అడ్డుతగిలి


"ఎటువంటి కల్తీలు లేని శుద్ధమైన సాహిత్యం రాసే మీలాంటి వాళ్ళు కుర్చీలు లేవని కూర్చోడం మానేశారు. నా పత్రికలో మీకుఉన్నతాసనంవేస్తానని సభాముఖంగా వాగ్దానం చేస్తున్నాను" గట్టిగా అరిచాడు అమావాశ్యపున్నమి.

బిగ్గరగా చప్పట్లతో వంత పాడారు సభికులు.

వాళ్ళతో చేతులు కలపలేక, అలాగని చేతులు ముడ్చుకుని కూర్చోలేక కుతకుతా ఉడుకు తున్నాడు శ్రీశైలం. అతనికి అనేక విధాల ప్రత్యర్థి మంగళగిరి.

ఆ కార్యాలయ సాహితీ సంస్కార సమితికే గాక ఉద్యోగ క్షేమ సంఘానికి కూడా మంగళగిరే ప్రసిడెంట్. తోటి ఉద్యోగుల్ని ఆకర్షించడం అతనికి పాలడబ్బాతో పెట్టిన విద్య. అందుకే అవలీలగా జోడుపదవుల్లో వెలిగిపో తున్నాడు.

ఆరునెలలక్రితం ఆ ఆఫీసుకి ట్రాన్సఫరై వచ్చిన శ్రీశైలానికి పదవి దురదపుష్కలంగా వుంది. నేరుగా మంగళగిరిని ఎన్నికల్లో ఢీకొని అతిదారుణంగా ఓడిపోయాడు. అయినా డీలా పడక ఉద్యోగుల్లో చీలిక తెచ్చి తనదనే చిన్న గ్రూప్ ఏర్పాటు చేసుకున్నాడు. ప్రత్యర్థిపై దెబ్బతీయాలని సమయం కోసం ఎదురు చూస్తున్నాడు.



"ప్రాచీన సాహిత్య ప్రయోజనం శూన్యం. -" అని అనర్గళంగా రెచ్చిపోతున్న మంగళగిరిని మెరుపులాంటి ఆలోచనతో నిలేశాడు శ్రీశైలం.

"నిరుపయోగమైన ప్రాచీన సాహిత్యాన్ని గత మూడు నెలలుగా ఎందుకు వల్లెవేస్తున్నావో తెలుసుకోవచ్చా?'

' దిగువశ్రేణి గుమస్తాగా పని చేస్తున్న మంగళగిరి ఆఫీసర్ గా ఎదగాలని ఏవన్ గ్రూప్ పరీక్షకి ప్రిపేరవుతున్నాడు ఆ పరీక్ష పాసైతే అతనికి ఆఫీసర్ జాబ్ వస్తుంది. బి.ఎస్.సి చదివిన అతను పోటీ పరీక్ష తెలుగు మెయిన్‌తో రాబోతున్నాడు. అందుకే ఆదివర్వం, సభావర్వం, పాండవోద్యోగ విజయాలు, హరి వంశం ఇత్యాదిప్రాచీన సాహిత్యం రోజూరుబ్బు తున్నాడు.

నోటమాట రాక మంగళగిరి బిగునుకుపోయేసరికి శ్రీశైలం విజృంభించాడు.

"నిష్ప్రయోజనమైన ప్రాచీన సాహిత్యంతో ఆఫీసర్ ఉద్యోగం కొట్టెయ్యాలని చూస్తున్నావు. నువ్వు చెప్పేది వొకటి చేసేది మరోటి. నీ కసలు నీతి నియమాల్లేవు. మన సభకి విజయవాడ నుంచి విశ్వనాథ సత్యనారాయణగారూ, మద్రాసు నుంచి శ్రీశ్రీగారు వస్తున్నారని, మన ఆఫీసుకి వచ్చే పార్టీల దగ్గర దండిగా చందాలు దండుకుని మింగేశావు""

"ఆ మహాకవులు స్వర్గస్తులైనట్లు నాకు చాలా ఆలశ్యంగా తెలిసింది. 'ఆ చందాల లెక్కలు నాదగ్గరున్నాయి, అనుమాన ముంటే ఆడిట్ చేయండి " ఎర్రబడిన మంగళగిరి నల్లబడలేక పొడి పొడిగా అన్నాడు.

"మాటలు మార్చడం...దొంగలెక్కలు సృష్టించడంలో నీకు నువ్వే పోటీ. ఈ కబుర్లకేం గాని...మన ఆఫీసర్‌గారి అమ్మాయి సీమంతానికి కలక్టు చేసింది ఎంత? ప్రెజంట్ చేసిన మట్టిగాజుల ఖరీదు ఎంత?" సూటిగా సవాల్ విసిరాడు

"అనవసరంగా ఆఫీసర్ గార్ని బురదలోకి లాగకండి. మనం ఎంత డొనేట్ చేస్తున్నా మనకొచ్చే పై ఆదాయం లోంచే యిస్తున్నాం" దిగ్గునలేచారు మంగళగిరికి కాపుకాసే యదగిరీ, సింహాచలం, పెంచలకొండ.

"ఆ లెక్కల వివరాలు చెప్పండి" బిగ్గరగా అరిచారు శ్రీశైలం మనుషులు మహానందీ, కోటప్పకొండా, కీసరగుట్ట,

చిలికిచిలికి గాలివానై వాగ్యుద్ధం చొక్కాచేతుల్ని పైకి ఎగదోసే స్థితికి వచ్చింది. సరిగ్గా అదే సమయంలో జగన్మోహినిలా ఆటోలోంచి దిగాడు ప్యూన్. కైపెక్కించే ఫుల్ బాటిల్స్. మసాలా టిఫెన్ పొట్లాల ఘుమఘుమలు.

అంతవరకు కీచులాడుకుంటున్న సభికులు కిమ్మన కుండా దేవదానవుల్లా బారులు తీరారు.

ఆ రాత్రేకాదు, వారం పదిరోజుల దాకా కంటిపై కునుకులేక, కడుపునిండా తినలేక, తెగ ఆలోచించాడు మంగళగిరి.

ఎంత కప్పెట్టినా తన అవినీతి ఎప్పుడో ఒకప్పుడు గుప్పుమనక మానదు. జనం తెలివిమీరారు. మళ్ళీఎన్నికలు వస్తే తాను గెలవడం అనుమానమే. తన దగ్గర తిని, శ్రీశైలం ఇంట్లో చేయికడుగుతారు. అంతటి ఘనులే తన కొలీగ్స్. ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు. తెలివిగా పదవునే గాక పదవినికూడా నిలుపుకోవాలి. ఎలా? ఎలా?

విరోధం తో సాధించ లేనిది స్నేహంతో నెగ్గుకు రావాలని తెలివైన నిర్ణయానికి అతిశీఘ్రంగా వచ్చాడు మంగళగిరి. శ్రీశైలాన్ని కెబ్రాబార్‌కి ఆహ్వానించాడు.

దీంట్లో ఏదో తిరకాసు వుందని సందేహించినా, మందూ, మనీ, మగువ పిలిస్తే సారీ చెప్పకూడదని తలూపాడు శ్రీశైలం.

ఇద్దరూ బార్ లో పక్కపక్కనే చోటు చేసుకున్నారు. భారీగా ఆర్డరిచ్చి సన్నసన్నగా మూలిగాడు మంగళగిరి.

"మనిద్దరిదీ ఒకే కులం. మనం పేచీలు పడితే వేరే కులం వాడికి లాభం. అలాజరగకూడదనే నిన్నిక్కడికి పిలిచాను. మనిద్దరం కలవాలి"

డిమ్ లైట్స్. మత్తుమ్యూజిక్. టేబుల్‌పై చికెన్ కట్‌లెట్. మటన్ ఫ్రై. మందు గ్లాసులు. దయాస్పైటు క్లాత్‌పీస్‌ల డాన్సర్.

బుసకొడుతున్నట్లు "చియర్స్" అంటూ గ్లాసులు కలిపాడు మంగళగిరి.ఇటువంటి

రాజీ ప్రస్తావన వస్తుందని ముందుగానే పసిగట్టాడు శ్రీశైలం. అందుకే చేయికలిపాడు యాంత్రికంగా.

రాజకీయాల్లో పర్మినెంట్‌గా మిత్రులు శత్రువులుండరువురి. అందుకే వాళ్ళిద్దరూకలిశారు.

"నాకవిత అమావాశ్యపున్నమి పత్రికలో వచ్చింది. నువ్వునన్ను సన్మానించాలి"

"నేనా? "తెల్లబోయాడు శ్రీశైలం.

"ఖర్చువాది కర్రపెత్తనం నీది.మన సాహితీ సంస్కారసమితికి రేపటి నుంచి నువ్వే ప్రసిడెంట్‌వి. నేనా పదవికి రాజీనామాచేసి నిన్ను ఏకగ్రీవంగా ఎన్నుకునేలా చేస్తాను." అంటూ జేబులోంచి ఇరవై రూపాయలనోట్లకట్టతీసి యిచ్చాడు మంగళగిరి.

"ఉద్యోగక్షేమ సంఘాన్ని నువ్వు ఏలతావా?"

"చెరోపదవిలో వున్నా మనిద్దరం వొకటే. ఆదాయాన్ని మూడోకంటికి తెలీకుండా పంచుకుందాం"

"ఓ.కే.డన్. ఫిఫ్టీ.ఫిఫ్టీ... వెరిగుడ్.మనీ. మందు యిచ్చావు. మరి మగువ" సరసంగానే గునిశాడు శ్రీశైలం.

"నువ్వంతగా అడగాలా? ఒకతానులో క్లాత్‌లం. మనిద్దరి దారి వొకటే...డౌన్‌స్ట్రీట్‌కి పోదాంపద." విజయోత్సాహంతో లేచాడు మంగళగిరి.

ఇద్దరూ తూలుతూ బార్ లోంచి బయటికి వచ్చారు. దూరంగా వున్న రిక్షాని కేకేశారు.

రిక్షావాడు భద్రాచలం కావడంతో విస్తుపోయిన మంగళగిరి పళ్ళికిలించాడు.

"లోన్ కోసం మళ్ళీ రాలేదేం?"

"ఏం వస్తానుసార్. డాక్టర్లని మేపడానికి ఉన్నపాటి కొద్దిపొలం అయిన కాడికి అమ్మేశాను ఆపరేషన్ బాగానే జరిగింది గాని మా ఆవిడ దక్కలేదు. పొట్టనింపుకోవడానికి ఇలా రిక్షావాడిలా మారాను." నిర్జీవహాసంతో గాఢంగా నిట్టూర్చాడు భద్రాచలం.

"నాకు లంచమిస్తే లోన్ శాంక్షన్ అయివుండేది. నువ్వు పొలాన్ని చవగ్గా అమ్మేసి ఇలా రిక్షావాడిలా మరే దుస్థితి వచ్చేదికాదు. అంతా దగా, మోసం. దోపిడీ. కుళ్లికంపుకొడుతున్న ఈ సంఘంపై పొయిట్రీ రాశాను. చదువుతాను విను" లజ్జావిహీనంగా తాగిన మత్తులో మాట్లాడుతున్న అతన్ని వారిస్తూ "మీరొక్కరు నీతిగా నిజాయితీగా నిక్కచ్చిగా సత్యంగా వుంటే ఈ సంఘం దుర్గంధం పిసరంత తగ్గుతుంది" వాతలు పెడుతూ విసురుగా బీడీ వెలిగించాడు భద్రాచలం.

●

# సమీక్ష

## "నేటి కవిత్వం" వివిధ దృక్పథాలు "సమీక్ష"



1980 నుండి నేటి వరకు అంటే స్త్రీవాద కవిత్వం, దళితకవిత్వాలను కూడ కలుపుకొని వస్తున్న కవత్వాన్ని ఆధునిక కవిత్వం అని అంటున్నాము. సామాజిక పరివర్తన, మనిషిని ఉన్నతుడిగా తీర్చిదిద్దటం అనేవి కవిత్వానికి ఉండవలసిన కనీస మౌలిక లక్షణాలు, అయితే నేటి కవిత్వంలో వస్తున్న రకరకాల ధోరణులను పరిశీలిస్తూ లోపాలను సరిదిద్దుకుంటూ ఇంకా వేడిగా వాడిగా అభివృద్ధి పరిచే క్రమంలో ఒక అవగాహనకు రావటం అటు పాఠకులకు ఇటు కవులకు ఇప్పుడు ముందున్న అవసరం. పోటీ ప్రపంచపు పోకడలు కవులలో కూడ పొడచూపాయేమో. నేటి కవిత్వం లో వస్తున్న ఆ పోక డల తాలూకు ధోరణుల వల్ల కవితాసక్తి ఉనికి ప్రమాదం పరిస్థితులు ఏర్పడ్డాయి అనిపిస్తుంది. అవగాహనా లోపం టిక్కిక్ గారడీలతో కొందరు కవులు నందిని సృష్టించబోయి పందిని చూపుతున్నారు. కాలానుగుణంగా మార్పు చెందుతూ వస్తున్న కవిత్వం సామాజిక వికాసానికి తోడ్పడటంలో ముందు వరుసలో ఉంటుంది. కాని దురదృష్టవశాత్తు అస్పష్టత, సంక్లిష్టత, టెక్నిక్‌ల సంక్షోభంలో అది కూరుకుపోయే ప్రమాదం ఏర్పడింది. దాని నుండి రక్షించవలసిన బాధ్యత సాహిత్యకారులందరిది. అదిగో ఆ ఆలోచనతోనే ఈ ధోరణులతో నిజాయితీగా ఘర్షణ చెంది పరిష్కారం కోసం కవిగా సౌభాగ్యగారు. పడిన తపన ఫలితమే ఆయన సంపాదకత్వంలో వెలువడిన "నేటి కవిత్వం" వివిధ దృక్పథాలు, ఈ ధోరణుల మీద దిగంబర కవుల నుండి ఆధునిక కవుల వరకు 37 మంది ప్రముఖుల మనోభావాలను మనముందు సాక్షాత్కరింప జేశాడు. సి.నా.రే., నగ్నముని, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, అఫ్సర్, కాకరాల, భద్రాచల శశితేజ్, శేషేంద్ర, రవిబాబు, ఖాయ్‌రాజ్, చలసాని వంటి ప్రముఖులు వీరిలో ఉన్నారు. వారు వ్యక్త పరిచిన అభిప్రాయాలను చదువుతుంటే కొందరు కవులు వారి వారిభుజాలను తడుముకోక తప్పదు. ఈ పుస్తకం చదివితే ఈనాటి కవులు ఎవరికి వారు ఆత్మ విమర్శ చేసుకొనే ఆలోచనకు ప్రేరేపిస్తుంది. అయితే పరిష్కారం కోసం సంపాదకుడు అన్నట్లు ఇది సమగ్రకాదు. కాని గందరగోళం నుండి బయట పడటానికి సాగే చర్చకు ఈ పుస్తకంతో సౌభాగ్యగారు ఒక మంచి వాతావరణాన్ని ఏర్పరిచారు. అభినంద నీయులు, ఇది ఛదవవలసిన పుస్తకం అనేకంటే చదవటం అవసరం ఉన్న పుస్తకం అనటం సందేహం లేదు. వెల పదిహేను రూపాయిలు, ప్రతులకు నేరుగా సంపా దకుడనే సంప్రదించాలి. పి. సౌభాగ్య, సిస్టమ్స్ ఆడిట్ డిపార్ట్‌మెంట్; హెచ్.ఎ. ఎల్., బాలానగర్, హైదరాబాద్-42.

పి. అజయ్ కుమార్ ఘోష్.